క్లుప్తంగా

వ్యాధి నిరోధక టీకాలు సక్రమంగా వేయండి



లబ్బీపేట(విజయవాడతూర్పు): చిన్నారులు, గర్భిణులకు వ్యాధి నిరోధక టీకాలను సక్రమంగా వేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ మాచర్ల సుహాసిని అన్నారు. ఆమె శనివారం నగరంలోని పలు యూపీహెచ్‌సీలతో పాటు, గుంటుపల్లి సచివాలయ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహిస్తున్న వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని పరిశీలించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు అందిస్తున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. డాక్టర్ సుధా ప్రసూజ, సీహెచ్‌ఓ నారాయణ, ఏఎన్‌ఎంలు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

10 నుంచి బ్యూటిషియన్ కోర్సులో శిక్షణ

కృష్ణలంక(విజయవాడతూర్పు): గవర్నర్‌పేటలోని ఎం.బి.విజ్ఞాన కేంద్రంలో ఈ నెల 10వ తేదీ నుంచి బ్యూటిషియన్ కోర్సులో శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామని ఎం.బి.విజ్ఞాన కేంద్రం మహిళా శిక్షణ విభాగం కన్వీనర్ పి.విజయ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎం.బి.విజ్ఞాన కేంద్రం, రోటరీ క్లబ్ ఆఫ్ విజయవాడ మిడ్‌టౌన్ సంయుక్త ఆధ్వర్యంలో మూడు నెలల పాటు రోజూ ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు శిక్షణ ఇస్తారని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్నవారు ఈ నెల 8వ తేదీ లోపు ఎం.బి.విజ్ఞాన కేంద్రం కార్యాలయంలో పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. ఇతర వివరాలకు 0866 2578044, 94900 98021లో సంప్రదించాలని సూచించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): హైటెన్షన్ విద్యుత్ తీగలు తగిలి షాక్‌కు గురైన వ్యక్తి చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందిన ఘటన కొత్తపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఘటనపై మృతుని భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గొల్లపూడి సారాకొట్టు సెంటర్‌కు చెందిన బోడ సామ్రాజ్యం, కిశోర్ భార్యభర్తలు. అతను రాడ్‌బెండింగ్ పని చేస్తుంటాడు. గత నెల 30న కేఎల్‌రావునగర్‌లో పనికి వెళ్లిన కిశోర్, బాబూరావు, సురేష్‌లు విద్యుత్‌షాక్‌కు గురి కావడంతో ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్న కిశోర్ శనివారం మధ్యాహ్నం మృతి చెందాడు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

దాడి కేసు నమోదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): ఇంటిపైకి వచ్చి అడిగినందుకు రాయితో దాడికి పాల్పడిన వ్యక్తిపై కొత్తపేట పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కలరా హాస్పటల్ పెద్ద మస్తాన్ వీధికి చెందిన షేక్ గఫర్ ఇంటిలో ఏళ్లుగా బాబు అనే వ్యక్తి అద్దెకు ఉంటున్నాడు. గఫర్ కుమార్తెకు వివాహం నిశ్చయం కావడంతో ఇల్లు ఖాళీ చేయాలని కోరాడు. దీంతో శుక్రవారం రాత్రి సమయంలో గఫర్ ఇంటిపైకి బాబు గొడవకు వెళ్లడమే కాకుండా అతని సోదరుడు సయ్యద్‌సాహిద్ రాయితో దాడికి పాల్పడ్డాడు. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

పూర్ణాహుతితో ముగిసిన నవమి వేడుకలు



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పూర్ణాహుతితో నగరాల సీతారామస్వామి దేవస్థానంలో రామనవమి వేడుకలు ముగిశాయి. కొత్తపేట శ్రీ నగరాల సీతారామస్వామి శ్రీ మహాలక్ష్మి అమ్మవార్ల దేవస్థాన కమిటీ ఆధ్వర్యంలో జరుగుతున్న శ్రీరామ నవమి వేడుకల్లో ఉదయం చూర్ణోత్సవం, వసంతోత్సవం పూర్ణహుతి తదితర కార్యక్రమాలు జరిగాయి. సాయంత్రం బలిహరణ, ధ్వజారోహణ, అశ్వవాహనోత్సవ చోరసంవాదం నిర్వహించారు. దేవస్థాన కమిటీ అధ్యక్షులు లింగిపిల్లి అప్పారావు, కోశాధికారి పిళ్లా శ్రీనివాసరావు, గౌరవ అధ్యక్షులు బెవర సూర్యనారాయణ పాల్గొన్నారు.

నూకాలమ్మ జాతర



చిట్టినగర్(విజయవాడపశ్చిమ): సొరంగం సమీపంలో శ్రీ నూకాలమ్మ జాతర మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. దుర్గాఘాట్ నుంచి ఆలయ నిర్వాహకులు, ఉభయదాతలు, భక్తులు కలశాలతో నదీ జలాలను తీసుకుని ఆలయానికి ఊరేగింపుగా చేరుకున్నారు. మేళతాళాలు, మంగళ వాయిద్యాల నడుమ అమ్మవారి ఉత్సవ మూర్తితో జరిగిన ఊరేగింపు నగర పురవీధుల్లో సాగింది. ఆలయంలో అమ్మవారికి అభిషేకాల అనంతరం పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు.

‘ప్రైవేట్’కు దీటుగా యూహెచ్‌సీలు

- ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు
- డాక్టర్ వైఎస్సార్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రారంభం



అర్బన్ హెల్త్ సెంటర్ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వెలంపల్లి, మేయర్ భాగ్యలక్ష్మి

భవానీపురం(విజయవాడపశ్చిమ): వైద్య రంగంలో అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని ప్రైవేట్ హాస్పటల్స్‌కు దీటుగా రాష్ట్ర ప్రభుత్వం డాక్టర్ వైఎస్సార్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను తీర్చిదిద్దిందని ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు చెప్పారు. చిట్టినగర్ 47వ డివిజన్ పరిధిలో సర్కిల్–1 కార్యాలయం వెనుక నిర్మించిన అర్బన్ హెల్త్ సెంటర్‌ను శనివారం ఆయన మేయర్ రాయన భాగ్యలక్ష్మి, స్థానిక కార్పొరేటర్ గోదావరి గంగతో కలిసి ప్రారంభించారు. అనంతరం హాస్పటల్ మొత్తం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ‘పశ్చిమ’లో నాలుగో అర్బన్ హెల్త్ సెంటర్ అని, వీటిలో పేషెంట్ ఏ సెంటర్‌కు వెళ్లి తమ పేరు రిజిస్టర్ చేయించుకున్నా వారి డేటాను ఎంట్రీ చేసుకుంటారని తెలిపారు. ఎప్పటికప్పుడు పేషెంట్ ఆరోగ్య పరిస్థితులను నమోదు చేసుకోవడంతోపాటు పాత హెల్త్ రిపోర్ట్స్ ప్రకారం వైద్యం చేస్తారని చెప్పారు.

నగరపాలక సంస్థ స్థలం కేటాయించగా కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్ర ప్రభుత్వం ఉచిత వైద్యం అందిస్తోందని తెలిపారు. ఒక్క థైరాయిడ్‌కు తప్ప మిగిలిన అన్ని రోగాలకు ఇక్కడ పరీక్షలు చేస్తారని పేర్కొన్నారు. ప్రతి పేదవాడికి ఇల్లు, ప్రతి పిల్లవాడు చక్కగా చదువుకోవాలని, ఉచిత వైద్యం అందించాలన్నదే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని చెప్పారు. నాడు–నేడుతో ప్రభుత్వ ఆస్పత్రులను అభివృద్ధి చేయడంతోపాటు పేదలను ఆరోగ్యశ్రీ పథకంలోకి తీసుకువచ్చారని పేర్కొన్నారు. ప్రతి జిల్లాలో మెడికల్ కళాశాలను ఏర్పాటు చేయాలన్నది సీఎం జగనన్న ధ్యేయమన్నారు.

లోకేష్‌ను క్షమాపణ యాత్ర చేయమనండి

గతంలో 14 ఏళ్లు సీఎంగా ఉన్న తన తండ్రి చంద్రబాబు పాలనలో చేయలేని మంచి పనులు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి కేవలం నాలుగేళ్లలో చేసినందుకు సిగ్గుపడుతూ క్షమాపణ యాత్ర చెయ్యాలని వెలంపల్లి.. లోకేష్‌కు హితవు పలికారు. చంద్రబాబు పాలనలో దోచుకోవడం తప్ప అభివృద్ధిని పూర్తిగా విస్మరించారని, అందుకే ప్రజలు 23 సీట్లకే పరిమితం చేశారని ఎద్దేవా చేశారు. లోకేష్ ఏ యాత్ర చేసినా అతనుగానీ, అతని తండ్రిగానీ సీఎం అయ్యే పరిస్థితి లేదని తెలిపారు. సీఎం జగన్ అభీష్టం మేరకు 175 సీట్లకు 175 గెలుపే లక్ష్యంగా ముందుకు వెళుతున్నామని చెప్పారు. రాష్ట్రంలో 175 నియోజకవర్గాల్లో అభ్యర్థులను నిలబెట్టలేని దద్దమ్మ లోకేష్ అన్నారు. సంక్షేమం, అభివృద్ధిరెండు కళ్లగా సీఎం జగన్ పాలన చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో నవరత్నాల వైస్ చైర్మన్ ఎ.నారాయణ మూర్తి, డీఎంహెచ్ఓ డాక్టర్ సుహాసిని, కార్పొరేటర్లు మరుపిళ్ల రాజేష్, యలకల చలపతిరావు, నాయకులు గోదావరి బాబు, కూరాకుల నాగ, కామళ్ల జోజి, కె.కాళేశ్వరరాజు, యరజర్ల మురళి, వెన్నం రజని, పిళ్లా సూరిబాబు, వరకాల జోషి, నన్నం దుర్గ, ఇ.విజయలక్ష్మి, తాండ్ర ఇంద్ర, అయితా కృష్ణకిషోర్, శీరం వెంకట్రావు, పోలిమెట్ల శరత్, బూదాల శ్రీను పాల్గొన్నారు.

మహిళలకు ఇచ్చిన హామీలు నెరవేర్చారు



డ్వాక్రా మహిళలకు చెక్ అందజేస్తున్న వెలంపల్లి, భాగ్యలక్ష్మి తదితరులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): మహిళలకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్నారని ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. స్వయం సహాయక సంఘాల మహిళల ఆర్థిక ఇబ్బందులను తన పాదయాత్రలో కళ్లారా చూసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి.. ఎన్నికలకు ముందు ఆ సంఘాలు ఎంతైతే బాకీ ఉన్నాయో దాన్ని నాలుగు విడతలుగా చెల్లిస్తానని నాడు ఇచ్చిన హామీని అధికారంలోకి వచ్చిన తర్వాత నెరవేరుస్తున్న ఘనత ఆయనకే దక్కుతుందని కొనియాడారు. వైఎస్సార్ ఆసరా వారోత్సవాల్లో భాగంగా చిట్టినగర్ కేఎల్‌రావు నగర్‌లో శనివారం మూడవ విడత వైఎస్సార్ ఆసరా సంబరాలు జరిగాయి. ఇందులో 46, 47, 50 డివిజన్ల పరిధిలోని 450 ఎస్‌హెచ్‌జీ గ్రూపుల్లోని 4500 మంది డ్వాక్రా అక్కచెల్లెమ్మలకు రూ.3.67 కోట్ల చెక్కును వారికి అందజేశారు. అనంతరం మహిళలతో కలిసి సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అలాగే మహిళలందరూ ‘మా నమ్మకం నువ్వే జగన్’ అని రాసిన కరపత్రాన్ని పట్టుకుని నినాదాలు చేశారు.

చంద్రబాబును ఎందుకు ప్రశ్నించ లేదు

వెలంపల్లి మాట్లాడుతూ 2014 ఎన్నికలకు ముందు డ్వాక్రా మహిళలకు రుణమాఫీ చేస్తానని చంద్రబాబు మోసం చేశాడని గుర్తు చేశారు. అప్పుడు చంద్రబాబుతో కలిసి ఉన్న జనసేన, వామపక్ష నాయకులు మహిళలను మోసం చేయడంపై ఆయన్ని ఎందుకు అడగ లేదని ప్రశ్నించారు. గతంలో చంద్రబాబు ప్రభుత్వంలో టిడ్కో ఇళ్ల పేరుతో 13 వేల మంది నుంచి బలవంతంగా డబ్బు వసూలు చేశారని అన్నారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో 31 లక్షల మంది పేదలకు ఇళ్ల స్థలాలు ఉచితంగా ఇచ్చి వారి సొంత ఇంటి కలను నెరవేర్చింది సీఎం జగన్ అన్నారు. రానున్న ఎన్నికల్లో చంద్రబాబుతో వామపక్షాలు పొత్తు పెట్టుకుని పోటీ చేస్తారని, వారెవ్వరికీ సింగిల్‌గా పోటీ చేసే దమ్ము, సత్తా లేదన్నారు. జనసేన, బీజేపీ, కమ్యూనిస్ట్ పార్టీలకు రాష్ట్రంపైగానీ, ప్రజలపైగానీ ప్రేమ లేదన్నారు. ఆయా పార్టీలన్నీ చంద్రబాబుకు అమ్ముడుపోయి తొత్తులుగా పని చేస్తున్నాయని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, నవరత్నాల వైస్ చైర్మన్ ఎ నారాయణమూర్తి, 47వ డివిజన్ కార్పొరేటర్ గోదావరి గంగ, 50వ డివిజన్ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ బంకా విజయ, బంకా చాము, 50వ డివిజన్ కార్పొరేటర్ బోయి సత్యబాబు, గోదావరి బాబు, దిద్దుకూరి శివ తదితరులు పాల్గొన్నారు.

శేఖర్‌బాబు సేవలు అపూర్వం : వెలంపల్లి



శేఖర్‌బాబు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న వెలంపల్లి, మేయర్ భాగ్యలక్ష్మి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ఏఐటీయూసీ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షులు కొరగంజి శేఖర్‌బాబు సమాజానికి అందించిన సేవలు అపూర్వమని పశ్చిమ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. కొరగంజి శేఖర్‌బాబు మెమోరియల్ ట్రస్ట్ చైర్మన్ కొరగంజి జగన్ ఆధ్వర్యంలో శేఖర్‌బాబు వర్ధంతి కార్యక్రమాన్ని కేఆర్ మార్కెట్ సెంటర్‌లోని ఆయన విగ్రహం వద్ద శనివారం నిర్వహించారు. ముఖ్యఅతిథులు వెలంపల్లి శ్రీనివాసరావు, మేయర్ రాయన భాగ్యలక్ష్మి.. శేఖర్‌బాబు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పేదలకు వస్త్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు మండేపూడి యటర్జీ, మరుపిళ్ల రాజేష్, వైఎస్సార్ సీపీ ట్రేడ్ యూనియన్ నగర అధ్యక్షులు విశ్వనాథ రవి, ట్రస్ట్ సభ్యుడు చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

- సీపీఐ ఆధ్వర్యంలోపాతబస్తీలోని ఆ పార్టీ ప్రధాన కార్యాలయమైన లెనిన్‌భవన్‌లో శనివారం వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. పార్టీ నగర కార్యదర్శి కోటేశ్వరరావు, జిల్లా సహాయ కార్యదర్శి దోనేపూడి శంకర్ తదితరులు పాల్గొన్నారు.
- సీపీఐ 53వ డివిజన్ శాఖ ఆధ్వర్యాన ఆ డివిజన్‌లో చేపల మార్కెట్ సెంటర్‌లో జరిగిన వర్ధంతి కార్యక్రమంలో నగర కార్యవర్గసభ్యులు కొట్టు రమణరావు, శంకర్, వైఎస్సార్ సీపీ నేత కొరగంజి భాను తదితరులు పాల్గొన్నారు.

మురుగు పారుదలకు చర్యలు తీసుకోండి



అవుట్‌ఫాల్ డ్రైన్‌ను పరిశీలిస్తున్న వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

పటమట(విజయవాడతూర్పు): మేజర్ అవుట్‌ఫాల్ డ్రైన్లలో మురుగునీరు పారుదలకు అడ్డంకులు లేకుండా సక్రమంగా పారడానికి చర్యలు తీసుకోవాలని చర్యలు తీసుకోవాలని వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. నగర పర్యటనలో భాగంగా ఆయన శనివారం న్యూ రాజరాజేశ్వరీ పేట ప్రాంతంలోని రైల్వే లైను వెంట ఉన్న అవుట్‌ఫాల్ డ్రైన్‌ను పరిశీలించారు. వన్‌టౌన్ నుంచి వచ్చే మురుగు నీటి ప్రవాహానికి రైల్వే శాఖ మూడో ట్రాక్ నిర్మాణ పనులకు వినియోగించే పరికరాలు అడ్డుగా వేసిందని, దీంతో వన్ టౌన్, పాత రాజరాజేశ్వరిపేట ముంపునకు గురవుతోందని అధికారులు ఆయనకు వివరించారు. న్యూ రాజరాజేశ్వరిపేట రైల్వే గేటు నుంచి సుబ్బరాజునగర్ వరకు పర్యటన సాగింది. అవుట్‌ఫాల్ డ్రైన్ వరకు ఉన్న అడ్డంకులను రైల్వేతో సమన్వయం చేసుకుని యుద్ధ ప్రాతిపదికన తొలగించాలని, ప్రస్తుతం ఉన్న మట్టి కాల్వ స్థానంలో ఆర్‌సీసీ డ్రైన్లను నిర్మించేందుకు అంచనాలు రూపొందించాలని ఆదేశించారు. ఈ పర్యటనలో చీఫ్ ఇంజినీర్ ఎం.ప్రభాకరరావు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు వి.శ్రీనివాస్, నారాయణ మూర్తి, డిప్యూటీ సిటీ ప్లానర్ (ప్లానింగ్) జుబిన్ శిరన్ రాయ్, హెల్త్ ఆఫీసర్లు డాక్టర్ సురేష్ బాబు, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ఆది దంపతుల పల్లకీ సేవ



పల్లకీ సేవలో దుర్గగుడి కమిటీ చైర్మన్ రాంబాబు, ఈఓ భ్రమరాంబ

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): చైత్రమాస బ్రహ్మోత్సవాల్లో తొలి రోజైన శనివారం ఆది దంపతులకు వెండి పల్లకీ సేవ జరిగింది. విజయవాడ ఇంద్రకీలాద్రిపై మల్లేశ్వర స్వామి వారి ఆలయం సమీపంలోని యాగశాల వద్ద శ్రీ గంగా పార్వతి సమేత మల్లేశ్వర స్వామి వార్ల ఉత్సవ మూర్తులను వెండి పల్లకీలో ఉంచి ఆలయ అర్చకులు పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం ఆలయ చైర్మన్ కర్నాటి రాంబాబు, ఈవో భ్రమరాంబలు ఉత్సవ మూర్తులకు పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం మేళతాళాలు, మంగళ వాయిద్యాల నడుమ, భక్త జనుల కోలాట నృత్యాలు, తీన్‌మార్ డప్పుల సందడి మధ్య ఆది దంపతుల పల్లకీ సేవ ముందుకు సాగింది. ఆలయ అధికారులతో పాటు స్థానాచార్య విష్ణుభట్ల శివప్రసాద్ శర్మ, వైదిక కమిటీ సభ్యులు రంగావజ్ఝుల శ్రీనివాసశాస్త్రి, యజ్ఞ నారాయణశర్మలతో పాటు ఇతర అర్చకులు పల్లకీ సేవలో పాల్గొన్నారు. మహామండపం, కనకదుర్గనగర్, రథం సెంటర్, బ్రహ్మణ వీధి, కోమల విలాస్ సెంటర్, సామారంగం చౌక్, రథం సెంటర్ మీదగా తిరిగి ఆలయానికి చేరుకుంది. తమ ఇంటి ముంగిటకు విచ్చేసిన శ్రీ గంగా పార్వతి సమేత మల్లేశ్వర స్వామి వార్లకు భక్తజనం హారతులిచ్చి పూజలు నిర్వహించారు.

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన



ధర్మపథంలో నృత్య ప్రదర్శన

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ధర్మపథం కార్యక్రమంలో భాగంగా శనివారం ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో ప్రదర్శించిన కూచిపూడి నృత్య ప్రదర్శన భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. విజయవాడ విద్యాధరపురానికి చెందిన ధనలక్ష్మి కూచిపూడి నృత్యాలయకు చెందిన హాసిని, రుత్విక, మోక్ష, నియతి, హన్వితలు పలు కీర్తనలకు నృత్య ప్రదర్శన ఇచ్చారు. అమ్మవారి పంచహారతుల సేవ అనంతరం ప్రదర్శించిన నృత్య ప్రదర్శనను భక్తులు ఆసక్తిగా వీక్షించారు. అనంతరం కళాకారులకు అమ్మవారి దర్శనం చేయించి ప్రసాదాలను అందజేశారు.

ట్యాక్సీ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ది విజయవాడ ట్యాక్సీ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యక్రమం ఏకగ్రీవంగా ఎన్నికైంది. శనివారం గవర్నర్‌పేటలో అమ్మన టవర్స్‌లోని అసోసియేషన్ హాల్లో ఎన్నికల ప్రక్రియ జరిగింది. అసోసియేషన్ అధ్యక్షులుగా జాస్తి బాల యుగంధర్, ఉపాధ్యక్షులుగా కె. వి. సురేష్ కుమార్, పిడికిటి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శిగా కుదరవల్లి వెంకట రాజేష్, ఉప కార్యదర్శులుగా మద్రి చెన్నారెడ్డి, తోట భార్గవ రామకృష్ణ, కోశాధికారిగా కాజ భరత్ కిరణ్ ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గం 2025 వరకు రెండేళ్లపాటు పదవిలో కొనసాగనుంది. నూతన కార్యవర్గాన్ని సభ్యులు ఘనంగా సత్కరించారు.



ఆటిజాన్ని ఆరంభ దశలోనే గుర్తించాలి

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఆటిజంను ప్రారంభ దశలోనే గుర్తించి చికిత్స ఇస్తే మంచి ఫలితాలు సాధించవచ్చని అయోధ్యనగర్ చేయూత మానసిక వికలాంగుల శిక్షణ సంస్థ డైరెక్టర్ డాక్టర్ టి.కృష్ణకుమారి అన్నారు. స్థానిక వైఎస్సార్ ఆరోగ్యకేంద్రంలో శనివారం ప్రపంచ ఆటిజం డే సందర్భంగా చేయూత మానసిక వికలాంగుల శిక్షణ సంస్థ ఆధ్వర్యాన అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఆటిజంను గుర్తించి చికిత్స చేయడంలో ఆరోగ్యకేంద్రం వైద్యులు, ఏఎన్‌ఎం, ఆశ కార్యకర్తల పాత్ర ముఖ్యమైందన్నారు. ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి డాక్టర్ దుర్గాభవాని మాట్లాడారు.

సంస్కృతి, సంప్రదాయాలపై అవగాహన ఉండాలి

గుణదల (విజయవాడ తూర్పు): విద్యార్థులు భారతీయ సంస్కృతి సంప్రదాయాలపై అవగాహన కలిగి ఉండాలని లయోల కళాశాల రెక్టర్ ఫాదర్ బాలశౌరి అన్నారు. ఆంధ్ర లయోల ఇంజినీరింగ్ కళాశాలలో వెంతూర–2023 సాంస్కృతికోత్సవం శనివారం జరిగింది. అనంతరం విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల రెక్టర్ ఫాదర్ ఫ్రాన్సిస్ జేవియర్, అసిస్టెంట్ డైరెక్టర్ బాల, ఫాదర్ రవీంద్ర, ప్రిన్సిపాల్ మహేష్ పాల్గొన్నారు.

సీతారాములకు ప్రత్యేక పూజలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): మాచవరం డౌన్ శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవంలో ఏర్పాటు చేసిన కూచిపూడి నృత్య ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది. శ్రీ వేంకటేశ్వర ఆర్ట్స్ అకాడమీ, నాట్యకళా కౌముది చింతా వెంకట శివరామకృష్ణ కుమార్ శిష్య బృందం చేసిన నృత్యాలు ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశాయి. భక్తి కీర్తనలకు అనుగుణంగా చేసిన నృత్యప్రదర్శన భక్తితన్మయత్వంలో తేలియాడించాయి. తొలుత శ్రీ శివజ్ఞానపీఠం శ్రీ శివాచార్యస్వామి సీతారాములకు ప్రత్యేక పూజలు, అర్చనలు చేశారు. ఉత్సవ కమిటీ అధ్యక్ష కార్యదర్శులు కంచర్ల వెంకటరాంబాబు, కె.సత్యకృష్ణప్రసాద్, కోశాధికారి ఎస్‌వీఆర్, తదితరులు పర్యవేక్షించారు.

అలరించిన గాత్ర కచేరి

విజయవాడ కల్చరల్: స్వరఝరి 35 వార్షికోత్సవం సందర్భంగా దుర్గాపురంలోని శ్రవణ సదనంలో శనివారం బెంగుళూరుకు చెందిన కొమ్మాజోస్యుల అలేఖ నిర్వహించిన కచేరీ శాస్త్రీయ సంగీత వైభవాన్ని చాటింది. మూడు తరాల సంగీత వైభవం పేరుతో నిర్వహించిన కార్యక్రమంలో అలేఖ వర్ణంతో ప్రారంభించి ముత్తుస్వామి దీక్షితార్, భక్తరామదాసు, మైసూరు వాసుదేవాచారి, పురందరదాసు, స్వాతి తిరునాళ్ రంచిన కీర్తనలను గానం చేశారు. ఆకాశవాణి టాప్ గ్రేడ్ ఆర్టిస్ కొమ్మాజోస్యుల సద్గురు చరణ్, విశాఖపట్నానికి చెందిన కొమ్మాజోస్యుల ఉదయలక్ష్మి వాద్యసహకారం అందించారు. ముగ్గురు ఒకే కుటుంబానికి చెందిన వారు కావడం విశేషం. స్వరఝరి కార్యదర్శి మోదుమూడి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

సీపీని కలిసిన బీబీఏ ప్రతినిధులు



విజయవాడ స్పోర్ట్స్: ఇటీవల జరిగిన బెజవాడ బార్ అసోసియేషన్(బీబీఏ) ఎన్నికల్లో గెలిచిన కె.బి.సుందర్, సభ్యులు ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ టి.కె.రాణాను పోలీస్ కమిషనరేట్‌లో శనివారం మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. బీబీఏ అధ్యక్షులు కె.బి.సుందర్, ఉపాధ్యక్షులు పి.శ్రీనివాస్, కార్యదర్శి జె.శ్రీధర్, సహాయకార్యదర్శి ఎస్.జ్యోతి, లైబ్రేరియన్ ఎ.పాండురంగవిఠల్, కోశాధికారి బి.వెంకటేశ్వర్లు, మహిళా కార్యదర్శి పి.జయలక్ష్మి, క్రీడా, సాంస్కృతిక విభాగం కార్యదర్శి పి.ఆంజనేయులు పుష్పగుచ్ఛం అందజేసి సీపీ రాణాను సన్మానించారు. బీబీఏకు ఎన్నికైన ప్రతినిధులను సీపీ రాణా అభినందించారు.

ప్రణాళికలతో లక్ష్యాలు సాధించాలి



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న జేసీ శ్రీవాస్‌నూపూర్ అజయ్‌కుమార్

మధురానగర్(విజయవాడసెంట్రల్): విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదివి జీవితంలో లక్ష్యాలు చేరుకోవాలని, విద్యతో పాటు నైపుణ్యాలు పెంపొందించుకోవాలని జాయింట్ కలెక్టర్ శ్రీవాస్‌నూపూర్ అజయ్‌కుమార్ సూచించారు. కంచికచర్ల సాంఘిక సంక్షేమ గురుకుల ప్రభుత్వ డిగ్రీ మహిళా కళాశాల దశమ వార్షికోత్సవం శనివారం ప్రిన్సిపాల్ వల్లూరు నీరజ అధ్యక్షతన జరిగాయి. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఉపసంచాలకులు శ్రీనివాసరావు, దేవదాయశాఖ ఉపసంచాలకులు ఎం.రత్నరాజు మాట్లాడుతూ విద్యకు పేదరికం అడ్డంకి కాదని ఇష్టపడి చదివి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ వల్లూరు నీరజ కళాశాల ప్రగతిని వివరించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆహూతులను అలరించాయి. ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులకు జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు బాలకృష్ణ, ధనలక్ష్మి, సుధారాణి, సుమిత్ర తదితరులు పర్యవేక్షించారు.

నేత్రపర్వం.. అశ్వవాహనోత్సవం



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): వన్‌టౌన్‌లోని శ్రీ రామా కన్యకాపరమేశ్వరి నగరేశ్వరస్వామి దేవస్థానం (కొత్తగుళ్లు)లో కొలువై ఉన్న శ్రీ కోదండరామ స్వామి వారి సన్నిధిలో శనివారం రాత్రి అశ్వవాహనోత్సవం నేత్రపర్వంగా సాగింది. ఉదయం ఆలయ ప్రాంగణంలో వసంతోత్సవం, చూర్ణోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. కోదండరామ స్వామి వార్షిక కల్యాణ బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఉదయం నుంచి రాత్రి వరకూ పలు ప్రత్యేక వైదిక కార్యక్రమాలు జరిగాయి. సీతాలక్ష్మణ ఆంజనేయ సమేతంగా రామచంద్రప్రభువుకు చక్రస్నానం తదితర కార్యక్రమాలు జరిగాయి. అనంతరం అవభృదోత్సవం శాస్త్రోక్తంగా జరిగింది. ఈ సందర్భంగా రంగులు పూసుకొని కార్యక్రమాన్ని నిర్వహించారు. మంగళవాయిద్యాలు, వేద మంత్రాల నడుమ ప్రత్యేక పూజలు జరిపారు. తొలుత పూర్ణాహుతి చేసి ధ్వజా అవరోహణ కార్యక్రమాన్ని అర్చకులు జరిపించారు. కార్యక్రమాలను ఆలయ అర్చకులు పులిపాక ఆంజనేయాచార్యులు, రాఘవాచార్యులు చేయగా కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

మత్తు పదార్థాల బారిన పడొద్దు

కృష్ణా జిల్లా న్యాయమూర్తి అరుణసారిక



హోమ్‌లోని పిల్లలను ఉద్దేశించి మాట్లాడుతున్న న్యాయమూర్తులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): మత్తు పదార్థాల బారిన పడొద్దని కృష్ణాజిల్లా న్యాయమూర్తి అరుణ సారిక సూచించారు. విద్యాధరపురం కబేళా రోడ్డులోని ప్రభుత్వ బాలుర పరిశీలన గృహాన్ని (జువెనైల్ హోమ్) కృష్ణా జిల్లా న్యాయమూర్తి అరుణ సారిక, సెకండ్ అడిషనల్ డిస్ట్రిక్ట్ సెషన్స్ జడ్జి/మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి శ్రీనివాస ఆంజనేయమూర్తి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ సెక్రటరీ రామకృష్ణయ్య, జువెనైల్ జస్టిస్ బోర్డ్ ప్రిన్సిపల్ మేజిస్ట్రేట్ సునందమ్మ శనివారం సందర్శించారు. హోమ్‌లోని పిల్లలతో సంభాషించి అక్కడ సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. అవసరమైన పిల్లలకు ఉచిత న్యాయ సేవలు అందిస్తామని తెలిపారు. తొలుత పిల్లల కోసం వండిన ఆహార పదార్థాలను రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ మత్తు పదార్థాలను వినియోగించి పిల్లలు నేరాలకు పాల్పడటం బాధాకరమన్నారు. అటువంటి వారికి సరైన మానసిక చికిత్సను అందించాలని హోం పర్యవేక్షణ అధికారికి సూచించారు. కార్యక్రమంలో హోం పర్యవేక్షణ అధికారి రామమోహన్ రెడ్డి, ప్రొహిబేషన్ ఆఫీసర్ హసన్ అలీ బేగ్, ప్యానల్ లాయర్ మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రామభక్తి సామ్రాజ్యాన్ని చాటిన సంకీర్తనలు

విజయవాడ కల్చరల్: శ్రీరామనవమి వేడుల సందర్భంగా గవర్నర్‌పేట చోడవరపు వారి వీధి శ్రీ సీతారామస్వామి దేవస్థానంలోని శ్రవణవేదికపై శనివారం నిర్వహించిన శాస్త్రీయ సంగీత కచేరీలు రామభక్తి సామ్రాజ్యాన్ని చాటాయి. సంగీత విద్వాంసులు వేమూరి విశ్వనాథ్ వాగ్గేయకారులు రామదాసు, అన్నమయ్య, త్యాగరాజ స్వామి రచించి స్వరపరచిన సంకీర్తనలను మధురంగా గానం చేశారు. కంచికామకోటిపీఠ ఆస్థాన గాయకులు పోపూరి గౌరీనాథ్, గాయత్రి గౌరీనాథ్, చారుమతి పల్లవి సంగీత త్రిమూర్తుల కీర్తనలతో పాటు భద్రాచల రామదాసు కీర్తనలకు గాన ప్రతిష్ట చేశారు. బీవీఎస్ ప్రసాద్ మృదంగంపై, పాలపర్తి ఆంజనేయులు వయోలిన్‌తో సహకరించారు. సంగీత కార్యక్రమాలను వంశపారంపర్య ధర్మకర్త విన్నకోట రామకృష్ణంరాజు ప్రారంభించారు. దేవాలయ అర్చకులు పిరాళ్ళ సాయికుమార శర్మ, చిట్టి నాగకృష్ణశర్మ, ఓరుగంటి సాయికుమార్ శర్మ సీతాసమేత రామచంద్రస్వామికి ప్రత్యేక పూజలు చేశారు.